## విలేఖరులు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న నేటిమన "జనం వాయిస్" తెలుగు దినపత్రికలో పనిచేయుటకు జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,నియోజకవర్గ ఆర్సీ ఇంచార్జీలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి.
సెల్ : 8121158069

నేటిమన
# జనం వాయిస్
తెలుగు దినపత్రిక

బుధవారం 3 డిసెంబర్ 2025

వేల రూ.2/ - పేజీలు : 4
సంపుటి: 01, సంచిక : 27

www.janamvoice.com
epaper.janamvoice.com

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## రెండోరోజూ అదే తీరు

- విపక్షాల నినాదాల నడుమ వాయిదా పడిన లోక్‌సభ
- "ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు ఉండటం సహజం
- కానీ సభలో కొందరు సభ్యుల ప్రవర్తన ఏమాత్రం ఆమోదనీయంగా లేదు
- సభ గౌరవాన్ని కాపాడండి. ప్రతి ఒక్క సభ్యునికి మాట్లాడే అవకాశమిస్తా

3

# అభివృద్ధిపై చర్చ పెట్టండి

- సమాజంలో దేవుళ్లు ఎంతమంది ఉన్నారో కాంగ్రెస్‌లో అన్నిరకాల మనస్తత్వాలుంటాయి
- మనకు దేవుడి విషయంలోనే ఏకాభిప్రాయం లేదు.. మీ విషయంలో ఎలా ఉంటుంది?
- పార్టీలో స్వేచ్ఛ లేకపోతే ఈపాటికి కనుమరుగయ్యేది..
- మీరు కుటుంబ పెద్దలా వ్యవహరించాలి.. అసంతృప్తులతో మాట్లాడాలి
- ఆరు నెలలే ప్రొబేషనరీ పీరియడ్..కష్టపడి పనిచేయాలన్న సీఎం
- ప్రతి ఒక్కరూ రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే దిశలోపనిచేయాలని విజ్ఞప్తి



కాళ్లలో కట్టెలు పెట్టడం.. రాజకీయాల్లో గేమ్ రూల్: సీఎం రేవంత్‌రెడ్డి

నేను పడిపోయా.. ఎవరో వచ్చి లేపాలంటే కుదరదు.. మనమే లేవాలి

కొత్తగా నియమితులైన డీసీసీ అధ్యక్షులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

హైదరాబాద్

'ఫుట్‌బాల్ ఆడుతుంటే కాళ్లతో తంతారు. అలా తంతారని, కాళ్లు తగులుతాయని ఫుట్‌బాల్ ఆడకుండా ఉంటామా? అలా కాలితో తన్నడమే ఫుట్‌బాల్ గేమ్ రూల్. అలాగే రాజకీయాల్లో కూడా కాళ్లలో కట్టెలు పెడుతుంటారు. అదే రాజకీయాల గేమ్‌రూల్. ఆ కట్టెలను తీసి పక్కన పెట్టి ముందుకెళుతుండాలి. నా కాళ్లలో కట్టెలు పెట్టారు. నేను బోర్లా పడిపోతాను. ఎవరో ఒకరు వచ్చి నన్ను లేపాలి అంటే కుదరదు. రాజకీయాల్లో మనమే లేవాలి.' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని, రాహుల్‌గాంధీ లాంటి వారిని ఇబ్బంది పెట్టాలని జీ%-%23 పేరుతో లేఖలు వస్తుంటాయని చెప్పారు. అలాంటి స్వేచ్ఛ ఉంది కాబట్టే పార్టీ 140 ఏళ్ల తర్వాత కూడా బతికి ఉందని, లేదంటే జనతా పార్టీలాగానో, ఇతర ప్రాంతీయ పార్టీల తరహాలోనో కనుమరుగయ్యేదని అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ భేటీ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం.. కొత్తగా నియమితులైన డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. 'కాంగ్రెస్ పార్టీలో సీఎం, మంత్రులు కావడం కంటే పార్టీ అధ్యక్షుడు కావడమే కష్టం. డీసీసీ అధ్యక్షుడు - మిగతా2లో



## వచ్చే ఏడాది నుంచి జనగణన షురూ

- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరిదాకా రెండు విడతల్లో జనాభాలెక్కల సేకరణ
- లోక్‌సభలో ప్రకటించిన కేంద్రం
- 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌దాకా తొలి విడత పూర్తిచేసి 2027 ఫిబ్రవరిలో మలివిడత



## డీకే సీఎం అవుతారు.. అధిష్ఠానం నిర్ణయిస్తే!

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య.. శివకుమార్ ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు హాజరు 3

# హాఫ్‌కు, ఫుల్‌కు ఆశపడొద్దు

మంచోళ్లను సర్పంచ్‌గా ఎన్నుకుంటేనే గ్రామాల అభివృద్ధి

- ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, సాగునీటి విధానాలతోనే రాష్ట్రానికి దేశంలో ప్రథమ స్థానం
- దేశం గర్వించేలా మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్సెస్ వర్సిటీ
- నెహ్రూ స్ఫూర్తితో యూనివర్సిటీల స్థాపన
- బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులు




ఖమ్మం/కొత్తగూడెం

గ్రామ సర్పంచ్‌లుగా మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. హాఫ్‌కు, ఫుల్‌కు ఆశపడి ఓటు వేస్తే గ్రామాలు దెబ్బతింటాయన్నారు. అందుకే రాజకీయ కక్షలు మాని.. మంత్రులతో కలిసి పనిచేసే వారిని, అభివృద్ధి చేసేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరుతో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని సీఎం రేవంత్ మంగళవారం సాయంత్రం - మిగతా2లో

## అత్యంత వేగంగా అసోం అభివృద్ధి

- దశాబ్ద కాలంగా శాంతియుత వాతావరణం
- రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి
- మీడియా ప్రతినిధులతో అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ

3




## ముగిసిన రెండోవిడత నామినేషన్ల స్వీకరణ




,332 స్థానాలకు 17వేలకు పైగా నామినేషన్లు. కొనసాగుతున్న ఏకగ్రీవాలు

గ్రామాభివృద్ధికి నిధులు ఇస్తామన్న వాళ్లకే పదవులు

నేటి నుంచి మూడో విడత ఎన్నికలకు నామినేషన్లు




## తెలంగాణ పురోగతికి గేమ్ చేంజర్

మరో రెండు భారీ రోడ్ నెట్‌వర్క్ ప్రాజెక్టులకు ప్రణాళిక

తెలంగాణ మణిహారం, ప్రజావలయం పేర్లతో రూపకల్పన

విజన్ డాక్యుమెంట్‌లో చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్

ఔటర్ రింగురోడ్డు.. హైదరాబాద్ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చిన రోడ్ నెట్‌వర్క్. ఇప్పుడు దానిని తలదన్నేలా రీజినల్ రింగు రోడ్డు ప్రాణం పోసుకుంటోంది. ఇది తెలంగాణ పురోగతికి గేమ్ చేంజర్‌గా నిపుణులు పేర్కొంటున్నారు. కానీ, ప్రభుత్వం ఈ రెండు రింగు రోడ్లకే పరిమితం కాలేదు. రాష్ట్ర వ్యాప్త ప్రాంతాలు అనుసంధానమయ్యే మరో రెండు బృహత్తర రింగు రోడ్లకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. 'తెలంగాణ రైజింగ్ విజన్-2047'డాక్యుమెంట్‌లో ఈ రెండు మెగా రోడ్ ప్రాజెక్టులను చేర్చింది. 2047 లక్ష్యంగా ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని ప్రభుత్వం పేర్కొంటోంది. ఇది దాదాపు రాష్ట్ర సరిహద్దులకు చేరువగా రూపొందే ఓ రింగురోడ్డు. దీని నిడివి దాదాపు 1,150 కి.మీ.లు. ఇది రాష్ట్రాన్ని చుట్టేస్తూ నగరాలు, జిల్లా కేంద్రాలు, పెరి-అర్బన్ ప్రాంతాలను అనుసంధానం చేసే మెగా రోడ్ నెట్‌వర్క్. ఇది దాదాపు అన్ని ప్రధాన జాతీయ రహదారులు, రీజినల్ - మిగతా2లో

నేటిమన జనం వాయిస్
తెలుగు దినపత్రిక
ఎడిటర్: గట్టు మహేష్ గౌడ్.
www.janamvoice.com
epaper.janamvoice.com



# అభివృద్ధిపై చర్చ పెట్టండి

-మొదటిపేజీ తరువాయి

అంటే పార్టీ కుటుంబానికి పెద్దలా వ్యవహరించాలి. ఈ పదవికి వయసు ముఖ్యం కాదు. అందరినీ సమన్వయంతో ముందుకు నడిపించే సమయస్ఫూర్తి ముఖ్యం. కాంగ్రెస్ పార్టీలో కోటి మంది కార్యకర్తలు ఉన్నారు. ఏకాభిప్రాయం సాధ్యమయ్యే పనికాదు. డీసీసీ అధ్యక్షుల విషయంలోనూ అంతే. మన సమాజంలో దాదాపు మూడు కోట్ల మంది దేవుళ్లు ఉన్నారు. దేవుళ్లు ఎంత మంది ఉన్నారో కాంగ్రెస్ పార్టీలో అన్ని రకాల మనస్తత్వాలుంటాయి.

దేవుడి మీదనే ఏకాభిప్రాయం లేదు. డీసీసీ అధ్యక్షుల విషయంలో ఎలా సాధ్యమవుతుంది? మీరు డీసీసీ అధ్యక్షులు అవడం కొందరికి ఇబ్బంది కావచ్చు. మీరే వెళ్లి వారితో మాట్లాడండి. సీనియర్ల దగ్గరికెళ్లి కలిసి పనిచేద్దామని అడగండి. పదవి రాకముందు అనేక సమస్యలుంటాయి. పదవి వచ్చిన తర్వాత అవన్నీ అధిగమించుకుంటూ పోవాలి. పనిచేసే క్రమంలో వచ్చే సమస్యలను పార్టీ పెద్దలతో మాట్లాడి పరిష్కరించుకోవాలి..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఆరు నెలలే మీకు సమయం**

'కొత్తగా డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన వారికి ఆరునెలలు మాత్రమే ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుంది. ఈ సమయంలో అందరూ కష్టపడి పనిచేయాల్సిందే. ప్రతి నెలా రిపోర్టు తెప్పించుకుంటారు. ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటారు. వచ్చే ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే దిశలో ఎవరు పనిచేయకపోయినా అధ్యక్ష పదవి ఉండదు..' అని రేవంత్ అన్నారు.

**అభివృద్ధిపై చర్చ పెట్టండి**

'రాజకీయాల్లో ప్రజలకు సేవ చేయడం ఎంత ముఖ్యమో, చేసింది చెప్పుకోగలగడం కూడా అంతే ముఖ్యం. అందరి కృషితో రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడింది. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం దిశలో నడిపించడమే కాకుండా అభివృద్ధి ప్రణాళికలతో ముందుకెళుతున్నాం. సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికీ చేరవేయండి. అభివృద్ధి ప్రణాళికలను ప్రతి వేదికపై చర్చ పెట్టండి. పెళ్లి, చావు, దావత్, కల్లు కాంపౌండ్‌లు.. ఇలా ఎక్కడైనా నాటి, నేటి పాలన గురించి చర్చ పెట్టండి. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు సారె కింద కోటి చీరలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని ఆడబిడ్డల దగ్గరికి చేర్చడం డీసీసీ అధ్యక్షులుగా మీ టాస్క్. ఏ ఆడబిడ్డా మాకు చీర రాలేదని చెప్పొద్దు. అలా చెపితే డీసీసీ అధ్యక్షులుగా మీరు పనిచేయనట్టే..' అని సీఎం అన్నారు.




**మోదీ, అమిత్‌షాకు భయపడేవారెవరూ లేరు..**

'నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ భయపడబోదు. మోదీ, అమిత్‌షాలకు భయపడేవారు ఇక్కడెవరూ లేరు. తమ ప్రాణాలనే కాదు ఆస్తులను కూడా త్యాగం చేసింది గాంధీ కుటుంబం. అలాంటి కుటుంబాన్ని కష్టపెడితే దేశ ప్రజలను కష్టపెట్టినట్టే. ఓట్ చోరీ అంశం దృష్టి మరల్చేందుకే ఈ కేసులు పెడుతున్నారు. ఇలాంటి చర్యలను దేశం సహించదు. గాంధీ కుటుంబానికి మనం అండగా నిలబడదాం. ఎందాకైనా పోరాడదాం. రావాల్సినవి ఇవ్వకపోతే కేంద్రాన్ని నేలమట్టం చేస్తాం

మోదీ గుజరాత్‌కు ప్రధానిలా కాదు..దేశానికి ప్రధానిలా వ్యవహరించాలి. బుల్లెట్ ట్రైన్ ఆయన రాష్ట్రానికి తీసుకెళ్లినట్టే మన రాష్ట్రానికి కూడా ఇవ్వాలి. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సినవి ఒకటికి పదిసార్లు అడుగుతాం. ఇస్తే సరి..ఇవ్వకపోతే నేల మట్టం చేస్తాం. తెలంగాణ ప్రజల వ్యవహారం ఎలా ఉంటుందో బీజేపీ రుచి చూస్తుంది..' అని రేవంత్ వ్యాఖ్యానించారు. కాగా సోనియా, రాహుల్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సీఎం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

**2029లో రాహుల్‌ను ప్రధానిని చేయాలి**

మీనాక్షి మాట్లాడుతూ.. గుజరాత్ డీసీసీ అధ్యక్షుల పనితీరును ప్రతి వారం సమీక్షిస్తున్నారని తెలిపారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో కఠిన నిర్ణయాలు తీసుకోకతప్పదు. ఇది మనకు పరీక్ష. ఈ పరీక్షలో పాస్ అయితేనే 2028లో జరిగే పరీక్షలో గెలుస్తాం. ఆ తర్వాత 2029లో జరిగే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేసుకోగలం. అలా చేసుకోలేకపోతే మీరు నేను ఉండి ప్రయోజనం లేదు.' అని వ్యాఖ్యానించారు.

మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీలో పనిచేసుకుంటూ వెళుతుంటే ఎవరో ఒకరు ఏదో ఒకరోజు గుర్తిస్తారని చెప్పారు. ఈ రోజు పనిచేసి రేపే ఫలితం రావాలంటే కుదరదని అన్నారు. డీసీసీ అధ్యక్షులు క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజహరుద్దీన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ సావంత్, డీసీసీల కొత్త, పాత అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఎన్ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ చైర్మన్లు పాల్గొన్నారు.

**కొందర్ని గదిలో వేసి కొట్టాలనిపించేది %-% సీఎం రేవంత్‌రెడ్డి**

నాకు ముఖ్యమంత్రి కాక ముందు చాలామంది మీద కోపంగా ఉండేది. కొంతమందిని గదిలో వేసి కట్టె తీసుకుని అలసి పోయేంతవరకు కొట్టాలని అనిపించేది. కానీ కొట్టే అవకాశం వచ్చినప్పుడు ఆలోచన చేయడం మొదలుపెట్టా. మన శక్తినెందుకు వేస్ట్ చేసుకోవాలనుకున్నా. అందుకే ప్రజలకు సేవ చేసే పని మీద ఉన్నా.

## హాఫ్‌కు, ఫుల్‌కు ఆశపడొద్దు

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీలే తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలుపుతున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమానికి పునాదులుగా నిలిచిన పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతంలోనే.. ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో యూనివర్సిటీని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. దీనిని దేశం గర్వించేలా, ప్రపంచ దేశాల్లో గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం భూములు కోల్పోయిన వారికి కాకుండా.. ఇతర ప్రాంతాల వారికి నాడు ఉద్యోగాలిస్తే తెలంగాణ ఉద్యమానికి పాల్వంచ ప్రాంతంలోనే పునాదులు పడ్డాయని తెలిపారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి ఇక్కడే పునాదిరాయి పడిందని గుర్తు చేశారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌లకు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రాధాన్యమిచ్చి భారతావనిని ప్రపంచ చిత్రపటంలో నిలబెట్టారని, దేశంలో ఆకలి కేకలను తీర్చేందుకు కృషి చేశారని సీఎం రేవంత్ అన్నారు. నేడు దేశంలో అత్యధిక ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసి ప్రతి వ్యక్తికీ అన్నం పెడుతున్న ఘనత తెలంగాణకే దక్కిందని తెలిపారు. భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరాంసాగర్ వరకు ప్రాజెక్టులన్నీ నాటి ప్రధాని నెహ్రూ హయాంలో ప్రారంభమైనవేనన్నారు. ఆనాడే అత్యధిక యూనివర్సిటీలను నెహ్రూ ప్రారంభించారని, తమ ప్రభుత్వం అదే స్ఫూర్తితో ముందుకెళుతోందని చెప్పారు. ప్రపంచంలోని ఖనిజ సంపదపై పరిశోధనలు జరగాలని, సింగరేణి లాంటి సంస్థలను పెంపొందించుకునేందుకు కొత్తగూడెంలో ఈ యూనివర్సిటీ స్థాపించామని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి ఇక్కడ పంటలు పండించి సిరులు కురిపించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అందుకే ఈ ప్రాంత ప్రాజెక్టులన్నీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి, అవినీతికి గురయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసిందే తప్ప.. ఖమ్మం జిల్లాకు నీళ్లు పారలేదని అన్నారు.

**ఆయువుపట్టు లాంటి శాఖలన్నీ ఆ ముగ్గురి వద్దే..**

పాలనకు ఆయువుపట్టు అయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల వద్దనే ఉన్నాయని సీఎం రేవంత్ తెలిపారు. ఆ ముగ్గురు అనుకుంటే ప్రభుత్వంలో జరగనిదేమీ ఉండదన్నారు. ప్రజలు పదేళ్లు తమకు అండగా ఉంటే... రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాం నాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అయితే హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం పీసీసీ సమావేశం జరగడంతో.. కొత్తగూడేనికి సీఎం రాక ఆలస్యమైంది. దీంతో యూనివర్సిటీ ప్రారంభోత్సవం, బహిరంగ సభా కార్యక్రమాలను చకచకా కానిచ్చేశారు. సాయంత్రం 4.50 గంటలకు సీఎం కొత్తగూడెం చేరుకోగా.. తిరిగి 5.46 గంటలకే వెళ్లిపోయారు. కేవలం 12 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు.

**నేడు హుస్నాబాద్‌కు సీఎం**

సీఎం రేవంత్ బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు రానున్నారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సభాస్థలిలోనే దాదాపు రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సీఎం సభ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి తొలిసారి హుస్నాబాద్‌కు వస్తుండటంతో నియోజకవర్గం నుంచి ప్రజలు ఈ సభకు తరలివస్తారని భావిస్తున్నారు.

# ముగిసిన రెండోవిడత నామినేషన్ల స్వీకరణ

హైదరాబాద్/గుర్రంపోడు/సంగారెడ్డి/నంగునూరు,

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండో విడతలో ఎన్నికలు జరిగే స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. రెండో విడతలో ఈ నెల 14న పోలింగ్ జరగనున్న 4,332 సర్పంచ్ స్థానాలకు 17వేలకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. తొలి రోజు 2,975మంది, రెండో రోజు 9,503, మూడో రోజు 5వేల పైచిలుకు మంది నామినేషన్లు సమర్పించారు. అలాగే, 38,342 వార్డు సభ్యుల స్థానాలకు మొదటి రోజు 3,608 మంది, రెండో రోజు 26, 438మంది నామినేషన్లు వేశారు. చివరి రోజు కు సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉంది. మరోపక్క, ఏకగ్రీవాలు కొనసాగుతున్నాయి. గ్రామాభివృద్ధికో, ఆలయాల నిర్మాణానికో నిధులు ఇస్తామన్న వారికి సర్పంచ్ పదవులు సొంతమవుతున్నాయి. నల్లగొండ జిల్లాల్లో రెండు పంచాయతీలు, సంగారెడ్డి జిల్లాలో ఐదు పంచాయతీలు మంగళవారం ఏకగ్రీవం అయ్యాయి. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని బుడ్డరెడ్డిగూడెం సర్పంచ్‌గా సింగం బాలకృష్ణను గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుడ్డరెడ్డిగూడెం, బోడపాడు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.25.20లక్షలు ఖర్చు చేస్తానని బాలకృష్ణ హామీ ఇవ్వడమే ఇందుకు కారణం. అలాగే, గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు ఖర్చు చేస్తానని ముందుకు రావడంతో వాడపల్లి వెంకన్న అనే వ్యక్తిని యలమోనిగూడెం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కుసునూరు, కౌడిపల్లి మండలం కుషాన్‌గడ్డ తండా, ధర్మసాగర్ గేట్ తండా, పీర్ల తండా, సిర్గాపూర్ మండల పరిధి సర్పంచ్ తండా పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. కుసునూరు సర్పంచ్‌గా రాజశేఖర్ గౌడ్, ఉప సర్పంచ్‌గా జయపాల్ రెడ్డిని గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ భవనం కోసం ఐదు గుంటల భూమి ఇస్తానని హామీ ఇవ్వడంతో కుషాన్‌గడ్డ తండా సర్పంచ్ పదవి రాజుకు దక్కింది. ధర్మసాగర్ గేట్ తండాలో రూ. 7 లక్షలు, పీర్ల తండాలో రూ. 10 లక్షలు గ్రామాభివృద్ధికి ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారికి మద్దతు ఇచ్చారు.

**నేటినుంచి మూడోవిడత నామినేషన్లు**

మూడోవిడత ఎన్నికల్లో భాగంగా 4,159 సర్పంచ్, 36,452 వార్డుసభ్యుల స్థానాలకు ఈనెల 17న, పోలింగ్ .జరగనుంది. ఇందుకు గాను నేటి (బుధవారం) నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈనెల 5 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ. కాగా వాటి పరిశీలన 6న, అభ్యంతరాల స్వీకరణ/పరిష్కారం 7, 8తేదీల్లో చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక 9న పోటీలోఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. ఇక, ఈనెల 11న పోలింగ్ జరగనున్న తొలివిడత ఎన్నికలకోసం నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కాగానే.. పోటీలోఉన్న అభ్యర్థుల జాబితాను ఎన్నికల విభాగాలు బుధవారం ప్రకటించనున్నాయి.

**అన్న మద్దతివ్వడంలేదని తమ్ముడి ఆత్మహత్యాయత్నం**

సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన తనకు తోడబుట్టిన అన్న మద్దతు ఇవ్వడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపూర్ గ్రామ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసిన గణపురం ఎల్లయ్య ఈ పని చేశారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ అయిన ఎల్లయ్య ప్రచారంలో భాగంగా తన అన్న, మాజీ సర్పంచ్ బాల్ నరసయ్యను కలిసి మద్దతు కోరాడు. నేను వేరే వాళ్లకు మాటిచ్చా నువ్వు పోటీ నుంచి తప్పుకోరా.. అని అన్న నరసయ్య చెప్పడంతో మనస్తాపానికి గురైన ఎల్లయ్య గడ్డి మందు తాగి చివరికి ఆస్పత్రి పాలయ్యాడు..

**అన్నదమ్ముల సవాల్**

వారిద్దరిది ఒకే రక్తం, ఒకే పార్టీ.. కానీ సర్పంచ్ పదవి కోసం ప్రత్యర్థులుగా మారారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పులిమామిడి సర్పంచ్ స్థానానికి నెల్లూరి సిద్దరాములు, నెల్లూరి దాసు అనే సొంత అన్నదమ్ములు మంగళవారం నామినేషన్లు వేసి స్థానికంగా చర్చకు తెరలేపారు. – చేగుంట

**సారూ.. ఈ ఒక్కటి తీసుకొండి**

ఈ ఫొటోలో పోలీసు కానిస్టేబుల్‌తో మాట్లాడుతున్న వ్యక్తి పేరు గొల్ల కిష్టయ్య. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన కిష్టయ్య వార్డు సభ్యుడిగా పోటీ చేయాలని ఆలస్యంగా నిర్ణయించుకున్నాడు. నామినేషన్ దాఖలుకు మంగళవారం చివరి రోజు కాగా.. మరో రెండు నిమిషాల్లో గడువు ముగుస్తుందనగా తూప్రాన్‌లోని ఐడీవోసి భవనానికి వెళ్లాడు. ఎలాగోలా దరఖాస్తు సంపాదించి పూర్తి చేశాడు. కానీ టైమ్ అయిపోయిందని అధికారులు కౌంటర్లు మూసేశారు. దీంతో సార్... ఈ ఒక్కటి తీసుకోండి.. అంటూ కిష్టయ్య కనిపించిన ప్రతీ అధికారిని వేడుకున్నాడు. కానీ నిరాశే మిగిలింది.

## తెలంగాణ పురోగతికి గేమ్ చేంజర్

-మొదటిపేజీ తరువాయి

రింగ్ రోడ్, రేడియల్ రోడ్లతో అనుసంధానమవుతుంది. ఏ రోడ్డు నుంచి ఏ రోడ్డు మీదకైనా వెళ్లేలా ఇది అనుసంధానిస్తుంది. దీన్ని ఆసరా చేసుకొని ఆయా ప్రాంతాలు పురోగమించేందుకు వీలుగా పరిశ్రమల ఏర్పాటుతోపాటు పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. బలమైన రోడ్డు నెట్‌వర్క్‌తో పెట్టుబడులు భారీగా వస్తాయన్నది ప్రభుత్వ అభిప్రాయం.

ఇది దాదాపు 770 కి.మీ. నిడివితో ఉంటుంది. గ్రామీణ తెలంగాణ పురోగతికి ఊతమిచ్చేందుకు ప్రత్యేకంగా రూపొందిన 770 కిలోమీటర్ల 'ప్రజావలయం'. రాష్ట్రంలోని మండలాలు, గ్రామాల మధ్య సూపర్ ఫాస్ట్ కనెక్టివిటీని కల్పిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు త్వరగా చేరేలా చేయటంతోపాటు గ్రామీణ యువతకు ఉపాధి, విద్య, ఆరోగ్య సేవలకు సులువైన రవాణా వ్యవస్థ కల్పించేందుకు దోహదం చేస్తుందని ప్రభుత్వం పేర్కొంటోంది. సరైన రోడ్ నెట్‌వర్క్ లేక కునారిల్లుతున్న పల్లెలకు ఇది జీవం పోస్తుందన్న భావనను వ్యక్తం చేస్తోంది. ఈ రెండింటికి రూ.36 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుందని అంచనా మొత్తం 1,920 కి.మీ. కొత్త రోడ్ల నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.36 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందన్నది ప్రాథమిక అంచనా. 'తెలంగాణ మణిహారం రాష్ట్రాన్ని మాలగా అలంకరించనుండగా, ప్రజావలయం ప్రతి పల్లెకు రక్తనాళంగా జవసత్వాలు కల్పిస్తుంది. 2047 నాటికి ప్రతి వ్యక్తి పురోగమించేందుకు ఈ రెండు రోడ్లు పునాది వేస్తాయి'ఇది ప్రభుత్వ మాట. ప్రస్తుతానికి విజన్ డాక్యుమెంట్.. కాగితాలకు పరిమితమైన ఆలోచన. అయితే ఇది కార్యరూపం దాల్చటంలో ఎన్నో సవాళ్లున్నాయి. ఔటర్ రింగురోడ్డుకు 50 కి.మీ. దూరంలో నిర్మించతలపెట్టిన రీజినల్ రింగురోడ్డు పదేళ్లుగా ప్రణాళికలకే పరిమితమైంది. అందులో సగ భాగం అయిన ఉత్తర రింగు వరకు భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నా, ఇంకా అవాంతరాలు వీడలేదు. దక్షిణ రింగు ఇంకా పురుడే పోసుకోలేదు. కనీసం అలైన్‌మెంట్ కూడా సిద్ధం కాలేదు. ఇలాంటి తరుణంలోఇంత భారీ బృహత్ రహదారి ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

## ఎర్త్ సైన్సెస్.. ఏంటి స్పెషల్?



భద్రాద్రి కొత్తగూడెం: దేశంలోనే తొలిసారిగా ఎర్త్ సైన్సెస్ కోర్సులను ఒకేచోట అందించేలా కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏమిటి దీని నేపథ్యం..ఇందులో ఉండే కోర్సులు ఏమిటి.. ఒకసారి చూద్దాం.. కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా కొత్తగూడెంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు మార్చి 27న సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. అనంతరం విశ్వవిద్యాలయానికి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా పేరు ఖరారు చేస్తూ జూన్ 5న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి యోగితా రాణాను జూన్ 30న నియమించారు. ఈ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ కోర్సులు ఉన్నాయి. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లోనూ ఈ కోర్సులు ఉన్నాయి. కాగా తొలి ఏడాది యూజీలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జియాలజీ కోర్సుల్లో విద్యార్థులు చేరారు. పీజీలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం వర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో మైనింగ్, కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, ఈసీఈ, ఐటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

దేశంలోనే తొలిసారిగా..: ఎర్త్ సైన్సెస్, ఎన్విరాన్‌మెంట్ విభాగాల్లో పలు కోర్సులను వేర్వేరు యూనివర్సిటీలు అందిస్తున్నాయి. ఒకచోట జియో ఫిజిక్స్ కోర్సు అందుబాటులో ఉంటే మరోచోట జియాలజీ వంటి కోర్సు అందుబాటులో ఉంది. అయితే భూమి, దాని స్వభావం, భూమిపై లభించే మూలకాలు, భూగర్భ జలాలు, భూమి పొరల్లో నిక్షిప్తమైన ఖనిజాలు తదితర అంశాలకు సంబంధించి అందుబాటులో ఉన్న కోర్సులన్నింటినీ ఒకేచోట అందించే ప్రయత్నం డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ద్వారా జరుగుతోంది. ఎర్త్ సైన్సెస్‌కు సంబంధించి దేశంలోనే ఇది తొలి వర్సిటీ అని, ఈ తరహా మరో వర్సిటీ కేవలం అమెరికాలో ఉందని చెబుతున్నారు.

**భవిష్యత్‌లో కీలకం..**

గడిచిన మూడు దశాబ్దాలుగా ఐటీ రంగంలో విప్లవా త్మక మార్పులు వచ్చాయి. కానీ ఈ మార్పులు ఇక్కడితో ఆగిపోవడం లేదు. సెమీ కండక్టర్ల తయారీ విభాగంలో అంతర్జాతీయంగా తీవ్రమైన పోటీ నెలకొంది. ముఖ్యంగా రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌కు మంచి డిమాండ్ ఉంది. ఈ రంగంలో గుత్తాధిపత్యం సాధించిన చైనా ఏకంగా అమెరికాకే సవాల్ విసిరే స్థాయిలో ఉంది. అందుకే చైనాపై ఆర్థిక ఆంక్షలు విధించే విషయంలో అమెరికా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తోంది. రేర్ ఎర్త్ విషయంలో మన దేశం ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తోంది. ప్రముఖ జాతీయ పరిశోధన సంస్థలతో సింగరేణి జట్టు కట్టింది. ఈ రంగం వైపు యువత ఎక్కువగా దృష్టి సారించేలా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ దోహదం చేయనుంది. పెరుగుతున్న కాలుష్యం వల్ల ఢిల్లీ నగరం ప్రతీ ఏడాది శీతాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ తరహా సవాళ్లను ఎదుర్కొనే నూతన ఆవిష్కరణల్లో వర్సిటీ తనవంతు సాయం చేసే అవకాశముంది. ఇక భూగర్భ జలాలపై జరిగే ఫోకస్ పెరిగితే సాగు, తాగునీటి రంగంలో మరిన్ని మేలైన యాజమాన్య పద్ధతులు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అంటున్నారు.

# సేవా తీర్థ్‌లో పీఎంవో

న్యూఢిల్లీ

ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) కొత్త కాంప్లెక్స్‌లోకి మారబోతోంది. ఇక నుంచి ఆ సముదాయాన్ని 'సేవా తీర్థ్'గా పిలుస్తారు. ప్రస్తుతం ఈ నూతన కాంప్లెక్స్ నిర్మాణం తుది దశలో ఉందని అధికారులు మంగళవారం వెల్లడించారు. సేవాస్ఫూర్తిని ప్రతిబింబించే కార్యస్థలంగా, జాతీయ ప్రాధాన్యాల రూపకల్పన కేంద్రంగా 'సేవా తీర్థ్' ఉంటుందని తెలిపారు. పరిపాలనాపరమైన ఆలోచన 'సత్తా(అధికారం)' నుంచి 'సేవ'కు మారుతోందన్నారు. అలాగే రాష్ట్ర గవర్నర్ నివాసం 'రాజ్‌భవన్' పేరును కూడా 'లోక్ భవన్'గా మార్చారు. ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ వరకు ఉన్న రహదారిని గతంలో రాజ్‌పథ్‌గా పిలిచేవారు. దానిని కూడా ఇటీవల 'కర్తవ్య పథ్'గా మార్చారు. 2016లో ప్రధాని అధికార నివాసం పేరును లోక్‌కల్యాణ్ మార్గ్‌గా, కేబినెట్ సచివాలయాన్ని 'కర్తవ్య భవన్'గా మార్పు చేసిన సంగతి తెలిసిందే. బ్రిటిషకాలం నాటి వలస వాసనలను పూర్తిగా తొలగించే ఉద్దేశంతో కొత్త నిర్మాణాలు, పేర్ల మార్పువంటివి మోదీ ప్రభుత్వం చేపట్టింది. సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలన్నిటినీ కొత్త 'ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్'కు మారుస్తున్నారు. ఇందులో పీఎంవోతో పాటు కేబినెట్ సచివాలయం, జాతీయ భద్రతా మండలి సచివాలయం, విదేశీ అతిథులతో అత్యున్నత స్థాయి చర్చలు జరిగే 'ఇండియా హౌస్' కూడా ఉంటాయి. ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్-1లో కొత్తగా




మూడు భవనాలు నిర్మిస్తున్నారు. అందులో వాయుభవన్ సమీపాన నిర్మించిన సేవాతీర్థ్-1లో పీఎంవో పనిచేస్తుంది. ఇప్పటికే అక్కడ కార్యకలాపాలు మొదలయ్యాయి. సేవాతీర్థ్-2లో కేంద్ర కేబినెట్ సచివాలయం ఆగస్టు నుంచే పనిచేస్తోంది. సేవాతీర్థ్-3లో జాతీయ భద్రతా మండలి కార్యాలయం ఉంటుంది. ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్-3లో ప్రధానమంత్రి నివాస సముదాయం రానుంది. 'ఈ మార్పులు లోతైన సైద్ధాంతిక పరివర్తనకు నిదర్శనం. అధికారం కంటే బాధ్యతను, స్థాయి కంటే సేవకు భారత ప్రజాస్వామ్యం ఎంపిక చేసుకుంటోంది. పేర్చు మార్చడం అంటే మైండ్‌సెట్ కూడా మారినట్లు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు పౌరులకే ప్రథమ ప్రాధాన్యమిస్తూ.. సేవ, కర్తవ్యాల భాషను మాట్లాడుతున్నాయి' అని అధికారులు పేర్కొన్నారు.

# డీకే సీఎం అవుతారు.. అధిష్ఠానం నిర్ణయిస్తే!

బెంగళూరు

"డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారు..! అది... హైకమాండ్ నిర్ణయించినప్పుడు" అని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. అధికార మార్పిడి విషయంలో అధిష్ఠానం ఏం తీర్మానిస్తే ఆ ప్రకారం నడుచుకుంటానని స్పష్టం చేశారు. కానీ, ఇప్పటివరకు ఎలాంటి సంప్రదింపులు జరగలేదన్నారు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు ఢిల్లీ వెళ్లి పార్టీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్‌ను కలుస్తానని... అయితే, ఇప్పటివరకు ఆహ్వానం అందలేదని తెలిపారు. అధికార మార్పిడి విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తాను, డీకే కట్టుబడతామని వెల్లడించారు. మంగళవారం సీఎం సిద్ధరామయ్య బెంగళూరు సదాశివనగరలోని డీకే ఇంటికి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు వెళ్లారు. ఇద్దరు నేతలు రెండు గంటలకు పైగా పలు అంశాలను చర్చించారు.

కాగా, నాయకత్వ మార్పుపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని అల్పాహార భేటీ అనంతరం ఇద్దరు నేతలు మరోసారి స్పష్టం చేశారు. సిద్ధు ఆహ్వానంతో గత నెల 29న ఆయన ఇంటికి డీకే బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. అప్పుడు డీకే కోరిక మేరకు మంగళవారం సిద్ధు ఆయన ఇంటికి వచ్చారు. రెండు సమావేశాల తర్వాత తామిద్దరం ఒక్కటేనన్న సందేశాన్ని ఇచ్చారు.

**మైసూరు మెనూతో...**

అల్పాహార విందులో తనకు పల్లె నుంచి నాటుకోడి తెప్పించాలని డీకేను కోరినట్లు సిద్ధు చమత్కరించారు. ఈ మేరకు మైసూరు శైలిలో నాటు కోడి పులుసు, ఇడ్లీ, సాంబార్‌ను డీకే సిద్ధం చేశారు. భేటీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ పాల్గొన్నారు. విందు అనంతరం సిద్ధు మీడియాతో మాట్లాడుతూ తామెప్పుడూ ఒకటిగానే ఉన్నామని, ఎమ్మెల్యేలూ



కలసికట్టుగా ఉన్నారని, ఒకే సిద్ధాంతం ప్రకారం నడుచుకుంటామని చెప్పారు. 2028లో ఉమ్మడిగా పనిచేసి.. తాను, డీకే మళ్లీ ప్రభుత్వాన్ని నెలకొల్పుతామనే ఆశాభావం వ్యక్తం చేశారు. డీకేతో రాజకీయ, పార్టీ అంశాలు, 8 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల గురించి మాట్లాడామన్నారు. 8న ఢిల్లీ వెళ్లి ఎంపీలతో మాట్లాడతామని, సమయం ఇస్తే హైకమాండ్‌ను కలుస్తానని సీఎం చెప్పారు. డీకే మాట్లాడుతూ... ఎమ్మెల్సీల ఎంపిక సహా సీఎం సిద్ధుతో రాజకీయ విషయాలను చర్చించానన్నారు. తమది ఒకటే గొంతుక అని, ఒకటే ఆచార వ్యవహారమని, ప్రతిపక్షాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు.

**సాదర ఆహ్వానం..**

సీఎం సిద్ధును డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్ ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించారు. సిద్ధుకు డీకే సురేశ్ పాదాభివందనం చేశారు. ఇద్దరు అన్నదమ్ములను సీఎం ఆత్మీయంగా పలకరించారు. సిద్ధు, డీకే ఇద్దరూ కార్టియర్ కంపెనీ వాచీలతో కనిపించారు. ఈ రెండూ ఒకేలా ఉన్నాయి. వీటి విలువ రూ.43 లక్షలని తెలిసింది. కాగా, సీఎం వాచీ విషయమై రాష్ట్ర బీజేపీ విమర్శలు గుప్పించింది. సర్వసాధారణమైన సమాజవాదినని చెప్పుకొనే సీఎం సిద్ధుకు ఇంత ఖరీదైన వాచీ ఎందుకని ప్రశ్నించింది.

# గగనతలాన్ని నిరాకరించ లేదు.. పాక్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన భారత్

న్యూఢిల్లీ

శ్రీలంకకు మానవతా సాయాన్ని తీసుకువెళ్తున్న తమ విమానాన్ని భారత గగనతలం మీదుగా వెళ్లేందుకు అనుమతించడం లేదంటూ పాకిస్థాన్ చేస్తున్న ప్రచారాన్ని కేంద్ర విదేశాంగ శాఖ (%వీజూా%) తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తి అసంబద్ధమైన ప్రకటన అని, ఇండియాకు వ్యతిరేకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేందుకు పాక్ జరిపిన మరో ప్రయత్నమని పేర్కొంది. పాక్ నుంచి అభ్యర్థన అందిన 4 గంటల్లోనే అనుమతి ఇచ్చామని స్పష్టం చేసింది. మానవతాసాయంతో కూడిన విమానానికి భారత్ క్లియరెన్స్ ఇవ్వలేదంటూ పాక్ చేసిన ప్రకటనను ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ (%=ఖఅనష్త్రఅతీ జీఖఅంఖుశ్రీ%) మంగళవారంనాడు జరిపిన మీడియా సమావేశంలో తప్పుపట్టారు. 'పాకిస్థాన్ విదేశాంగ శాఖ చేసిన ప్రకటనలో నిజం లేదు. భారతకు వ్యతిరేకంగా జరుపుతున్న మరో తప్పుడు ప్రచారం ఇది' అని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తమ విమానానికి అనుమతి కోరుతూ ఇస్లామాబాద్‌లోని ఇస్లామాబాద్ ఇండియన్ హైకమిషన్‌కు అభ్యర్థన వచ్చిందని, మానవతా సాయం



కావడంతో భారత ప్రభుత్వం అదే రోజు క్లియరెన్స్ ఇచ్చిందని ఎంఈఏ తెలిపింది. సాయంత్రం 5.30 గంటలకు అధికారంగా అనుమతి మజూరు చేసినట్టు వెల్లడించింది. దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో భారీ ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగింది. 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. శ్రీలంక ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించి అంతర్జాతీయ సాయం కోసం అభ్యర్థన చేసింది. మొదటిగా స్పందించిన భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సాగర్ సింధు' కింద భారీ ఎత్తున సహాయ సామగ్రిని పంపింది. శ్రీలంకను అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చింది.

## రెండోరోజూ అదే తీరు

న్యూఢిల్లీ: పలు రాష్ట్రాల్లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేపై పార్లమెంట్‌లో చర్చకు విపక్షపార్టీల సభ్యులు పట్టుబట్టడంతో శీతాకాల సమావేశాల రెండోరోజు సభాకాలంసైతం నిరుపయోగంగా ముగిసింది. ఎస్ఐఆర్‌పై చర్చకు తామేమీ విముఖత చూపట్లేమని, కాలావధిపై పట్టుబట్టడం సరైన పద్ధతికాదంటూ కేంద్రప్రభుత్వం వ్యాఖ్యానాలతో విపక్షాలు ఏమాత్రం సంతృప్తిచెందలేదు. మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జార్జియా ప్రతినిధి బృందాన్ని పార్లమెంట్ గ్యాలరీలోకి ఆహ్వానించి సభాకార్యక్రమాలు మొదలెట్టారు. ప్రశ్నోత్తరాల సమయం ఆరంభంకాగానే విపక్షసభ్యులు తమతమ స్థానాల నుంచి లేచినిలబడి ఎస్ఐఆర్‌పై వెంటనే చర్చించాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళనల నడుమే పలువురు మంత్రులు తమను అడిగిన లిఖితపూర్వక ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అయినా విపక్షసభ్యులు నినాదాలు ఆపలేదు. దీంతో స్పీకర్ ఆగ్రహంతో "ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు ఉండటం సహజం. కానీ సభలో కొందరు సభ్యుల ప్రవర్తన ఏమాత్రం ఆమోదనీయంగా లేదు. సభ గౌరవాన్ని కాపాడండి. ప్రతి ఒక్క సభ్యునికి మాట్లాడే అవకాశమిస్తా. అప్పటిదాకా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యయుత పార్లమెంట్‌గా సభ అత్యున్నత ప్రమాణాలను పాటించండి" అని హితవు పలికారు.

అయినా నినాదాలు సద్దుమణగకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైన కేవలం 10 నిమిషాలకే నినాదాలు రెట్టించడంతో సభను వెంటనే 2 గంటలకు వాయిదావేశారు. లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు మళ్లీ మొదలైనా విపక్షసభ్యుల నినాదాలతో హోరెత్తిపోయింది. ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రభుత్వం సైతం సమాయత్తమవుతోందని, సభ సజావుగా సాగేలా సంయమనం పాటించాలని విపక్ష సభ్యులకు సభాధ్యక్షుడి స్థానంలో కూర్చున్న దిలీప్ సైకియా విజ్ఞప్తిచేశారు. విపక్ష సభ్యులు నినాదాలు ఆపకపోవడంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదావేశారు.

**పార్లమెంట్ ప్రాంగణంలో విపక్ష ఎంపీల ధర్నా**

ఎస్ఐఆర్‌తోపాటు ఎన్నికల సంస్కరణలపై ఉభయసభల్లో చర్చకు ప్రభుత్వం సమ్మతి తెలపకపోవడంతో నిరసనగా విపక్ష పార్టీల ఎంపీలు మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో ధర్నాకు దిగారు. నిరసనలోభాగంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలిచ్చారు. "ఎస్ఐఆర్‌ను అంతం చేద్దాం. ఓట్ల చోరీకి ముగింపు పలుకుదాం', 'ఎస్ఐఆర్ అంటేనే ఓట్ల చోరీ', 'వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల ఓట్లను తొలగించారు" అనే ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ వాద్రాసహా పలు విపక్ష పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. " పార్లమెంట్ దేశ ప్రజలదని మోదీ పదేపదే అంటారు. తీరా ప్రజాసమస్యలపై చర్చిద్దామంటే జడుసుకుంటారు. చర్చించకుండా పారిపోతున్నారు" అని ఎద్దేవాచేశారు. "ప్రజాస్వామ్యంలో ఓటింగ్ హక్కుల కంటే పెద్ద సమస్య మరోటి ఉంటుందా?"అని తర్వాత 'ఎక్స్'లో రాహుల్ ఒక పోస్ట్ చేశారు. డీఎంకే నేతలు కనిమొళి, టీఆర్ బాలు, సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిట్టాస్ తదితరులు సైతం పార్లమెంట్ మకరద్వారం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్నారు

## అత్యంత వేగంగా అసోం అభివృద్ధి

ఒకప్పుడు తీవ్రవాద కార్యకలాపాలతో అట్టుడికిన అసోం.. ఇప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏడు రోజుల అసోం పర్యటనకు వెళ్లిన తెలంగాణ మీడియా బృందం మంగళవారం అసోం ముఖ్యమంత్రిని కలిసింది. గువాహటిలోని సీఎం అధికారిక నివాసంలో జరిగిన భేటీలో అసోంలో శాంతి భద్రతలు, అభివృద్ధి, పెట్టుబడులు, ఆరోగ్యం, మహిళా సాధికారత వంటి అంశాలపై ఆయన మాట్లాడారు. దశాబ్దాల పాటు తీవ్రవాద కార్యకలాపాలతో అల్లాడిన అసోంలో... ఒక దశాబ్ద కాలంగా పూర్తి శాంతియుత వాతావరణం నెలకొందని గుర్తు చేశారు. ఈ కారణంగానే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని వివరించారు. ఎరువులు, ఎథనాల్ ఉత్పత్తి యూనిట్లు, సెమీకండక్టర్ ప్లాంట్ వంటి మెగా ప్రాజెక్టులతో రూ 4-5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని తెలిపారు. గత ఏడాది మూలధన పెట్టుబడుల్లో 36్ర వృద్ధి నమోదైందని, ఐదేళ్లలో యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 6్ర ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. 'ఒక జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ' అనే లక్ష్యంతో ఇప్పటికే 15 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని, మరో 10 నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. టాటా ట్రస్ట్‌తో భాగస్వామ్యం తో 17 క్యాన్సర్ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సాధికారత కోసం విశేషంగా కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో బహు భార్య త్వ నిషేధ బిల్లు త్వరలోనే అమలులోకి రానుందని, దీనికి అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అమ్మాయిల చదువుకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

## వచ్చే ఏడాది నుంచి జనగణన షురూ

న్యూఢిల్లీ



దేశవ్యాప్తంగా రేషన్ కార్డుల జారీ మొదలు వృద్ధాప్య పెన్షన్ల దాకా పలు సంక్షేమ పథకాలను లబ్ధిదారులను గణించడంతోపాటు దేశ జనాభా సరళిని తెలియజెప్పే అత్యంత కీలకమైన జనగణన క్రతువు ఎట్టకేలకు వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో ఆరంభంకానుంది. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ విషయాన్ని లోక్‌సభలో వెల్లడించారు. రెండు విడతల్లో జనగణనను పూర్తిచేస్తారు. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌దాకా తొలి విడత పూర్తిచేసి 2027 ఫిబ్రవరిలో మలివిడతతో ముగిస్తారు. తొలి విడతలో దేశంలో మొత్తం ఎన్ని ఇళ్లు ఉన్నాయి, నివాస ప్రాంతాల్లో పక్కా గృహాలు ఎన్ని, ఎన్ని అంతస్తుల్లో భవనాలు నిర్మించారు? పూరి గుడిసెలు ఎన్ని? కాంక్రీట్ నిర్మాణాలు ఎన్ని? ఏఏ రకం ముడి పదార్థాలతో ఏ తరహా ఇల్లు నిర్మించారు? ఇలా ఇళ్లకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. రెండో విడతలో ఆయా ఇళ్లలో ఉంటున్న కుటుంబాలెన్ని? కుటుంబంలో ఎంత మంది ఉంటున్నారు? వారి పేరు, వయసు వంటి వివరాలు సేకరిస్తారు. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ప్రతి 30 రోజులకు ఒక కాలావధిగా తీసుకుని లెక్కిస్తారు. 2027 మార్చి ఒకటోతేదీని రిఫరెన్స్ తేదీగా లెక్కలోకి తీసుకుంటూ 2027 ఫిబ్రవరిలో జనాభా లెక్కలు మొదలెడతారు. మంచు, అతి చలి, అననుకూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్,ఉత్తరాఖండ్‌లలో అనువైన సమయాల్లోనే జనగణన చేపట్ట నున్నారు. ఇక్కడ 2026 అక్టోబర్ ఒకటోతేదీని రెఫరెన్స్ తేదీగా తీసుకోనున్నారు. కేంద్రప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు అందించే సలహాలు, సూచనలతోపాటు పాత డేటాను లెక్కలోకి తీసుకుని జనగణన ప్రశ్నావళిని ఖరారుచేశామని మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న కేంద్ర కేబినెట్ కమిటీలో నిర్ణయించిన మేరకు ఈసారి కులగణన సైతం చేపట్టనున్నారు. స్వీయ జనగణనతోపాటు మొబైల్ యాప్‌ల సాయంతో ఈసారి డిజిటల్ రూపంలో జనగణన%-%2027 కొనసాగనుంది.

నేటిమన జనం వాయిస్ తెలుగు దినపత్రిక
ఎడిటర్: గట్టు మహేష్ గౌడ్.
www.janamvoice.com
epaper.janamvoice.com



# జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగావాహన తనిఖీలు

## దొంగల మర్రి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





**జగిత్యాల :** సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. కొడిమ్యాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా బార్డర్ వద్ద ఏర్పాటు చేసిన దొంగల మర్రి చెక్‌పోస్ట్ ను ఎస్పీ గారు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తునామని, నగదు, మద్యం, ఉచిత పంపిణీలు, ఇతర ప్రలోభాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నదని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున పోలీసులు అన్ని శాఖల సమన్వయంతో ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్‌ను కఠినంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. "ఓటర్లను ప్రలోభ పెట్టే ఏ చర్యలకు కూడా ఎవరూ పాల్పడవద్దు అని ఎన్నికలకు సంబంధించి అక్రమంగా నగదు, మద్యం లేదా వస్తువులు తరలిస్తే, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. సరైన ఆధారాలు లేకుండా భారీ మొత్తంలో డబ్బులు తీసుకెళ్తే సీజ్ చేయడం జరుగుతుందని ,అత్యవసర అవసరాలకు నగదు తీసుకెళ్తే తగిన బిల్లులు, పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా, పకడ్బందీగా తనిఖీ చేయాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట మల్యాల సీఐ రవి, ఎస్ఐ సందీప్, చెక్‌పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిల్లులు అడిగినందుకు: సర్పంచులను జైలు పాలు చేసిన కాంగ్రెస్ సర్కారు.

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట :** గ్రామాల్లో పెండింగ్ బిల్లులు ఏవి మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం. కాంగ్రెస్ పాలనలో పారిశుధ్యం పడకేసిందిసిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ లోకి వలసల వెల్లువ కాంగ్రెస్, బీఎస్పీ ఖాళీ. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ను చిత్తు చిత్తుగా ఓడించాలి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, కేసీఆర్ అభివృద్ధి పాలనను కోరుకుంటూ సిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. కుకునూరుపల్లి, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల కీలక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గజ్వేల్ లో మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ. అవ్వ తాతలకు నెలకు 4000 పెన్షన్ ఇస్తామని బాండ్లు రాసిచ్చి, అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపారు. రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.. యాసంగి రైతుబంధు పడలేదు,2 లక్షల రుణమాఫీ సగం మందికి కూడా పూర్తి కాలేదు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్ని వర్గాల ప్రజలను గోస పెడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నాయకులు ఆర్భాటంగా ఆడబిడ్డ పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయింది. ఒక్కరికైనా తులం బంగారం ఇచ్చారా? కొత్తవి దేవుడెరుగు, ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కూడా నెలల తరబడి పెండింగ్ లో పెట్టి పేదల పెళ్లిళ్లకు సాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. గతంలో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఆపివేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. బిల్లులు ఇవ్వాలని అడిగిన పాపానికి సర్పంచులను జైలు పాలు చేసింది కాంగ్రెస్



ప్రభుత్వం. సర్పంచుల పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకుండా, ప్రత్యేక అధికారుల పాలన తెచ్చి గ్రామాలను ఆగం చేశారు. గ్రామాల్లో ఖర్చులు భరించలేక పంచాయతీ కార్యదర్శులు లీవులు పెట్టి వెళ్ళిపోయే పరిస్థితి వచ్చింది. కనీసం స్ట్రీట్ లైట్స్ నిర్వహణ లేక గ్రామాలు చీకటిమయం అయిపోయాయి. పారిశుధ్యం పడకేసి విషజ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటుతో బుద్ధి చెప్పాలి, చిత్తు చిత్తుగా ఓడించాలి. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే, మళ్ళీ మనకు మంచి రోజులు వస్తాయి, అందరి కష్టాలు తీరుతాయి.

చేరికల వివరాలు:

మాజీ ఎఫ్.డి.సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవి రవీందర్, గ్రామ అధ్యక్షుడు ఎక్కడ దేవి శ్రీశైలం ఆధ్వర్యంలో..కుకునూరు పల్లి మండలం రాయవరం గ్రామం కాంగ్రెస్ నుండి మాజీ ఉప సర్పంచ్ గుర్రం మహేందర్, కమ్మరి రవి, బీఎస్పీ మండల్ ప్రెసిడెంట్ బక్కోళ్ల కర్ణాకర్, విలేజ్ ప్రెసిడెంట్ ఎడబాట్ల రాజు, గుర్రం పరశు రాములు, గ్రామ వైస్ ప్రెసిడెంట్ పెర్క రంగస్వామి, రాగం అనిల్, రసం కార్తీక్ తదితరులు చేరారు. గజ్వేల్ మండలం, దాతర్‌పల్లి సర్పంచ్ అభ్యర్థి తలారి స్వాతి స్వామి, అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, తోట గోపాలకృష్ణ, గూడూరు వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సుమన్, తలారి సత్యనారాయణ, తలారి సాయిబాబా ఆధ్వర్యంలో.. జూపల్లి మధు, వనం నరేష్, కంటే ప్రశాంత్, దుబ్బల రమేష్, దుబ్బల రాజు, దుబ్బల సిద్ధూ, జూపల్లి కృష్ణ తదితరులు చేరారు. జగదేవ్‌పూర్ మండలం బండతిమ్మాపూర్ గ్రామానికి చెందిన కీసరీ నరసింహ మరియు తిమ్మాపూర్ సర్పంచ్ అభ్యర్థి, నాయకులు పార్టీలో చేరారు. కాంగ్రెస్, బీఎస్పీల నుండి వచ్చిన నాయకులకు పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని హరీష్ రావు సూచించారు.

# హిల్ట్ భూములపై బీఆర్ఎస్ పోరాటం

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది. హైదరాబాద్ మహానగర పరిధిలో రూ. 5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ'పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దాన్ని అడ్డుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన 'నిజనిర్ధారణ బృందాలను' నియమించారు. దీనిలో భాగంగా పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల విలువైన భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్.ఆర్.ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ కుంభకోణం నిజా నిజాన్ని ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టేందుకు, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు డిసెంబర్ 3, 4 తేదీల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తాయి. ఈ పర్యటనలలో బీఆర్ఎస్ నాయకులు స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకుని, వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచాలని ప్లాన్ చేశారు. ఈ పర్యటనల్లో, పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా



ఉపయోగ కార్యక్రమాలు ఏమేం చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాల డిమాండ్లు, ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును, ప్రభుత్వాలు అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టిన అంశాన్ని, వాటి అసలు ఉద్దేశాలను ఈ బృందాలు ప్రజలకు వివరించనున్నాయి. డిసెంబర్ 3, 4 తేదీలలో స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం ఃఖీూ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. క్లస్టర్-1లో మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో గంగుల కమలాకర్, దేశపతి శ్రీనివాస్ మరియు మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించి స్కామ్ ఎలా జరుగుతుందో వివరించనున్నారు. క్లస్టర్-2లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చెర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు. క్లస్టర్-3కు సంబంధించి మధుసూదనాచారి, మర్రి రాజశేఖర్ రెడ్డి, రవీందర్ రావు మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడలను సందర్శించి భూముల ధర, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలను ప్రజలకు వివరిస్తారు. ముఖ్యంగా క్లస్టర్-4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. మరోవైపు క్లస్టర్-5లో తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియాలను పరిశీలిస్తారు. క్లస్టర్-6లో చామకూర మల్లారెడ్డి, శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు. క్లస్టర్-7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి కాటేదాన్, హయత్ నగర్ లో పర్యటిస్తారు. చివరగా క్లస్టర్-8లో మాజీ మంత్రి మహమూద్ అలీ, దాసోజు శ్రవణ్, ఎండీ సలీం చందులాల్ బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి.

-పెద్దపల్లి డీసీపీ భూక్యా రాంరెడ్డి.

-పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీసీపీ.



**జనం వాయిస్,రామగిరి(డిసెంబర్ 02):** రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి ఉంటుందని పెద్దపల్లి డీసీపీ భూక్యా రాంరెడ్డి అన్నారు. మంగళవారం రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వచర్ల, పన్నూరు, రత్నాపూర్ ,బేగంపేట్ గ్రామాల లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గోదావరిఖని ఏసిపి మడత రమేష్ తో కలిసి ప్రత్యక్షంగా సందర్శించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి,అక్కడి పరిసరాలను సమీక్షించి శాంతిభద్రతల పరంగా తీసుకోవాల్సిన పలు సూచనలను గుర్తించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా అవసరమైన అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు భయభ్రాంతి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించే వాతావరణం కల్పించడానికి,పోలింగ్ రోజు ఎలాంటి అక్రమాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛ గా వినియోగించుకునేలా పోలీస్ తరుపున అన్ని భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని చట్టవ్యతిరేక చర్యలు ఎవరు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటమని డీసీపీ గారు తెలిపారు. స్థానిక ప్రజలకు, అన్ని పార్టీల కార్యకర్తలకు శాంతి భద్రతలు,చట్టపరమైన నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంథని సిఐ బి.రాజు,రామగిరి ఎస్సై లు తాడవేని శ్రీనివాస్,పి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి.

-పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

-డిసెంబర్ 5న జిల్లా కలెక్టరేట్ లో మెగా జాబ్ మేళా.

**జనం వాయిస్,పెద్దపల్లి,(డిసెంబర్-02):**



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో డిసెంబర్ 5న ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ రీజనల్ ఆధ్వర్యంలో డిసెంబర్ 5న సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. జాబ్ మేళా కార్యక్రమానికి ఐటి ,ఐటియేతర 15 కంపెనీలు హాజరవుతాయని,డిగ్రీ, బీటెక్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఐటిఐ డిప్లమా కోర్సులు చేసిన నిరుద్యోగ యువత జాబ్ మేళా కు హాజరు కావాలని అన్నారు. కంపెనీ ప్రతినిధులు విద్యార్థులను ఇంటర్వ్యూ నిర్వహించి వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందని,అభ్యర్థులకు వయోపరిమితి 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఆసక్తిగల నిరుద్యోగ యువత డిసెంబర్ 5న నిర్వహించే జాబ్ మేళా కార్యక్రమానికి 3 నుంచి 4 సెట్ల తమ రెస్యూమ్ కాపీలతో హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నూతన జంటకు వంట సామాగ్రి అందజేత.



**జనం వాయిస్,మంథని:**

చేయూత మంత్రపురి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంథని మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన నూతన జంటకు మంగళవారం వంట సామాగ్రిని అందించారు. మంథని పట్టణానికి చెందిన 1989-90 సంవత్సరానికి చెందిన పదవ తరగతి బ్యాచ్ వారు ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా నూతన జంటకు వంట సామాగ్రిని అందించారు. చేయూత మంత్రపురి సంస్థ ద్వారా తమకు వంట సామాగ్రిని అందించడం పట్ల నూతన దంపతులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో సంస్థ సభ్యులు కోటయ్య,నన్నే గారి రాము, కొమురోజు మధు, పెండం నరేందర్, తోట సత్యం, మంథని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల సాయి జీనియస్ హైస్కూల్‌లో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం

**కోరుట్ల :** పట్టణంలోని సాయి జీనియస్ హైస్కూల్ లో ప్రతి ఏడాది లాగే డిసెంబర్ 2న మంగళవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. 1994లో జరిగిన భోపాల్ గ్యాస్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన నిరపరాధు లకు అంకితమిస్తూ ఈ కార్యక్రమనీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి జీనియస్ హైస్కూల్ కరస్పాండెంట్ చౌకి రమేష్ మాట్లాడుతూ పారిశ్రామిక విపత్తులు, మానవ నిర్లక్ష్యం వల్ల ఏర్పడే కాలుష్యం, పర్యావరణంపై వాటి తీవ్రమైన ప్రభావం గురించి విద్యార్థి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. గాలి, నీరు, నేల వంటి వివిధ రకాల కాలుష్యాన్ని నియంత్రించాల్సి న అవసరం, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాల్సిన బాధ్యత గురించి వివరించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కాలుష్య నియంత్రణపై వ్యాసరచన పోటీ నిర్వహించగా, విజేత లకు స్కూల్ యాజమాన్యం